## క్లుప్తంగా

### 1నుంచి జీరో విద్యుత్ బిల్

నిర్మల్‌చైన్‌గేట్: తెల్ల రేషన్‌కార్డు ఉండి అర్హులైన వినియోగదారులకు మార్చి ఒకటి నుంచి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందిస్తామని ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయనివారు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని వారు సూచించారు.

### బీజేపీ మండలాధ్యక్షుడిపై ఫిర్యాదు

నిర్మల్: సారంగపూర్ ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశం రసాభాసగా మారింది. బీజేపీకి చెందిన తొమ్మిది మంది ఎంపీటీసీల్లో ముగ్గురు బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఓటు వేశారనే అక్కసుతో బీజేపీ మండలాధ్యక్షుడు కరిపె విలాస్.. తనపై దాడి చేశాడని ఎంపీపీ సవితాబాయి మరిది ఆడె భీంరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీంరావుపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భైంసా: ట్రిపుల్‌ఐటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో ఉన్న సెక్యూరిటీ అధికారికి వినతిపత్రం అందించారు. జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులతో సమావేశమయ్యారు. బాసర ట్రిపుల్ ఐటీ కార్మిక వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### కెపాసిటర్లు బిగించుకోవాలి

కడెం: వ్యవసాయ విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ఏఈ సుమన్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అంబారిపేట్ గ్రామంలో కెపాసిటర్లతో కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. కెపాసిటర్లతో విద్యుత్ హై, లోవోల్టేజ్ సమస్య ఏర్పడినా మోటార్లు కాలిపోకుండా ఉంటాయని పేర్కొన్నారు.

### పొదుపు అలవాటు చేసుకోవాలి

సోన్: విద్యార్థులు పొదుపు అలవాటు చేసుకోవాలని కడ్తాల్ దక్కన్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఉదయశ్రీ అన్నారు. బుధవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా మండలంలోని జాఫ్రపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్, పొదుపు పథకాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

### భూమిపూజ

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ పద్మ ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టే పనులకు భూమిపూజ చేశారు. అడ్వాల రమేశ్, బీజేపీ మండల ఇన్‌చార్జి భూపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్, బీజేపీ నాయకులు మెంగు అనిల్, భీంరెడ్డి, అఖిల్ పాల్గొన్నారు.

### పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ఉపాధి నిధులు రూ.3.50లక్షలతో నిర్మించే మురుగు కాల్వ పనులను బుధవారం బీజేపీ నాయకుడు భోజన్న ప్రారంభించారు. కార్యక్రమంలో గంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, లింగారెడ్డి, భోజన్న ఉన్నారు.

### క్షీరాభిషేకం

లోకేశ్వరం: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు గ్యారంటీలను అమలు చేస్తున్నందుకు బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, పండరిగౌడ్, నగేశ్‌గౌడ్, సోమ సుధీర్‌రెడ్డి, సుధాకర్, రాంచందర్‌రావు, ముత్తగౌడ్, షఫీ, నర్సింగ్‌రావు, మహేందర్, రాజేశ్వర్ ఉన్నారు.

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

భైంసాటౌన్: ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని.. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ అన్నారు. కుభీర్ మండలం మాలేగాంకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. శంకర్ చంద్రే, ఓంప్రకాశ్ లడ్డా తదితరులున్నారు.

### కరపత్రం ఆవిష్కరణ

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామ అయ్యప్ప ఆలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో నీ గానమే నా ప్రాణం అనే కార్యక్రమాన్ని మార్చి 25న నిర్వహిస్తున్నట్లు గురుస్వామి నర్సారెడ్డి తెలిపారు. బుధవారం ఆలయంలో కార్యక్రమ కరపత్రాలను సీనియర్ గురుస్వామి శనిగరం చిన్నయ్య, ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు గోపిలతో కలిసి ఆవిష్కరించారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అఖండ భజన ఉంటుందని వారు పేర్కొన్నారు. హరికుమార్‌వర్మ, భక్తులు ఉన్నారు.

# సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

- పాఠశాలల్లో అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు
- జాతీయ సైన్సు దినోత్సవం
- సీవీ రామన్‌కు ఘన నివాళి



సోన్: న్యూవెల్మల్‌బొప్పారం ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

తానూరు: విద్యార్థులు సైన్సుపై ఆసక్తి పెంచుకోవాలని మండలంలోని ఎల్వి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.నరేందర్ అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్‌లను సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు సుజాతదేవి, సుదర్శన్, మాధవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వడ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాల, అక్షర ఉన్నత పాఠశాలలో కాలుష్య నియంత్రణ చర్యలపై ప్రదర్శనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, మోహన్, అశోక్‌వర్మ పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రబంధకారిణీ సభ్యులు ఉన్నారు భైంసాలోని తెలంగాణ మైనార్టీ గురుకులం, అల్ఫోర్స్‌లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అల్ఫోర్స్ చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్సై వి.రజనీకాంత్, గ్రామీణ్ సపోర్ట్ చైర్మన్ కడారి నరేష్, హెచ్‌ఎం ఎల్లన్న పాల్గొన్నారు.

సోన్: మండలంలోని న్యూవెల్మల్‌బొప్పారం, పాక్‌పట్ల, జాఫ్రపూర్, సిద్ధులకుంట గ్రామాల్లోని పాఠశాలల్లో సైన్సు దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. తొడిశెట్టి పరమేశ్వర్ ,ప్రధానోపాధ్యాయులు నాలం విద్యాసాగర్, కె.వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, ఖానాపూర్ బాలికల, పాతఎల్లాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లలో సైన్స్ ఫేర్, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులు సేకరించిన పురాతన నాణేలు, నోట్లను ప్రదర్శించారు. పట్టణంలోని ఏసీఈ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సైన్స్ ఫేర్ ఏర్పాటు చేయగా విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. హెచ్‌ఎంలు రమాదేవి, కె.రమేశ్, సంధ్యారాణి, సుష్మరాణి, స్రవంతి, వెంకటేశ్, శ్రీదేవి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని కేజీబీవీలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. ఫౌండేషన్ ఇన్‌స్ట్రక్టర్ నవీన్, ప్రిన్సిపాల్ అనసూయ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిర్మల్:సారంగపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్‌ఫేర్ కార్యక్రమానికి ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రయోగాలు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేశ్, తదితరులు ఉన్నారు.



లక్ష్మణచాందలో..



ఖానాపూర్ : పాతఎల్లాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో..



లోకేశ్వరం : కేజీబీవీలో..



కుంటాల: పెంచికల్‌పాడ్ పాఠశాలలో..



తానూరు: ఎల్విలో ఉపాధ్యాయులకు సన్మానం



భైంసా అల్ఫోర్స్‌లో..

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను వెనక్కి పంపించేసిన అధికారులు



కడెం: ఆలస్యంగా రావడంతో బయట విద్యార్థులు

ముధోల్: మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో 377 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 37 మంది గైర్హాజరైనట్లు డీవో ప్రశాంత్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 258 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

కుభీర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 155 మంది విద్యార్థులకు 150 మంది పరీక్ష రాయగా.. ఐదుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ సోము, ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు.

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 276 మంది విద్యార్థులకు గాను 263 మంది పరీక్ష రాయగా 13 మంది గైర్హాజరైనట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. తొలిరోజు పరీక్షకు ముగ్గురు విద్యార్థులు పావుగంట ఆలస్యంగా రావడంతో వారిని అనుమతించలేదు. తహసీల్దార్ సుజాత పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు.

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం నిర్వహించిన తెలుగు పరీక్షకు 409 మంది విద్యార్థులకు గాను 390 మంది హాజరయ్యారు. 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, డిపార్ట్‌మెంటల్ అధికారి టి. శ్రీనివాస్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీవో అబ్దుల్ రహీం, ఎస్సై వి.రజినీకాంత్ పరిశీలించారు.

లోకేశ్వరం: విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీవో హరిప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 108 మంది హాజరవాల్సి ఉండగా.. 104 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తుకారాం, చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఇంటర్ పరీక్షల ఇన్‌చార్జి మహేందర్, చిన్నయ్య, విఠల్, శ్రీనివాస్ ఉన్నారు.

**ఆలస్యంగా వచ్చి వెనుదిరిగిన విద్యార్థులు**

ఖానాపూర్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విష్ణువర్ధన్ అనే దివ్యాంగుడైన విద్యార్థి ఏఆర్ఎస్ కేంద్రానికి బదులు ప్రభుత్వ కళాశాలకు వచ్చాడు. అధికారులు, అప్రమత్తం చేయడంతో చివరి క్షణంలో ఏఆర్ఎస్ కళాశాలకు వెళ్లి పరీక్ష రాశాడు. ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలోని కేంద్రం వద్దకు నలుగురు విద్యార్థులు అరగంట ఆలస్యంగా రావడంతో వారిని వెనక్కి పంపించేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 252 మంది విద్యార్థులకు గాను 15 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ హమీద్ తెలిపారు. ఏఆర్ఎస్ జూనియర్ కళాశాలలో 314 మంది విద్యార్థులకు గాను 33 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ భూక్యా రమేశ్‌నాయక్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ శివరాజ్, ఎస్సై లింబాద్రి, ఎంపీడీవో సునీత తదితరులు పరిశీలించారు.

**నిమిషం నిబంధనతో పరీక్షకు దూరం**

భైంసాటౌన్: నిమిషం నిబంధనతో బుధవారం ప్రారంభమైన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు పలువురు దూరమయ్యారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో 1,061 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 981 హాజరయ్యారు. 80 మంది గైర్హాజరయ్యారు. కాగా, పలువురు కేంద్రాలకు ఆలస్యంగా చేరుకున్నారు. దీంతో నిమిషం నిబంధన కారణంగా వారిని అనుమతించకపోవడంతో వెనుదిరిగారు. తానూరు మండలం హంగిర్గాకు చెందిన దివ్యాంగ విద్యార్థి అరుణ్ తన పరీక్ష రాసే సహాయకుడు ఆలస్యంగా రాగా అతడూ పరీక్షకు దూరమయ్యాడు.

# వైభవంగా ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న శ్రీహంపి విరూపాక్షనందస్వామి



ఖనాపూర్ : దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో శ్రీరాజరాజేశ్వర ఆలయ శివపంచాయతన ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. సందీప్‌శర్మ బృందం ఆధ్వర్యంలో గణపతిపూజ, స్థలాన్యాస, అంగసంబార, శాంతి పౌష్టికహోమాలు, మూలమంత్ర హోమాలు, గర్తన్యాస, రత్నన్యాస, దాస, బీ జా న్యాస తదితర పూజాది కార్యక్రమాలు జరిపించారు. శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్యస్వామి కరకమలములచే యంత్ర స్థాపన, మూర్తి ప్రతిష్ఠ, ధ్వజప్రతిష్ఠ, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మిలనము, ధృక్‌బలి, అష్టదిక్పాలక క్షేత్ర బలిప్రదానం, మహాపూర్ణాహుతి, కుంభాప్రోక్షణ, శిఖర ప్రోక్షణ, పార్వతీ పరమేశ్వరుల శాంతికల్యాణం, నిర్వహించారు. ఎమ్మెల్యే బొజ్జు, నేతలు పూజలు చేశారు.

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్‌లో ఘనంగా శ్రీశ్రీశ్రీ శివ పంచాయతన మహాదేవుడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. శ్రీ సంజయ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం ఉదయాత్ పూర్వం, పుణ్యాహవచనం, గర్తన్యాసం, నిర్వహించారు. విగ్రహాల ఏర్పాటుకు రూ.2 లక్షలను విరాళంగా అందించిన దాత చంద్రకాంత్‌ను సన్మానించారు.

### 'నర్సారెడ్డి మృతి తీరని లోటు'

నిర్మల్‌టౌన్: మాజీ మంత్రి దివంగత పి.నర్సారెడ్డి మృతి నిర్మల్‌కు తీరని లోటని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో నర్సారెడ్డి సంతాప సభ నిర్మల్ మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు నర్సారెడ్డితో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నర్సారెడ్డి నిర్మల్‌కు చేసిన అభివృద్ధిని కొనియాడారు. మా ఊరి బాపు వలె ఆలోచించి, స్వర్ణ, దోనిగామ ప్రాజెక్టులను సాధించి నిర్మల్ ప్రాంతాన్ని జలకలతో నింపిన అపర భగీరథుడు అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, డాక్టర్ అప్పల చక్రధరి, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏఎస్ లింగన్న, సారంగపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కౌన్సిలర్లు మేడారం అపర్ణ-ప్రదీప్, సైండ్ల ఉమారాణి-శ్రీధర్, నల్లూరి పోశెట్టి, తారక రఘువీర్, సాయన్న, అడప పోశెట్టి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రిని కలిసిన డైరెక్టర్లు

కుంటాల: కుంటాల పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాంపై పలువురు బీఆర్ఎస్ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా మాజీ మంత్రి ఐకే రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి సూచన మేరకు అవిశ్వాసాన్ని డైరెక్టర్లు వెనక్కి తీసుకున్నారు. బుధవారం మాజీ మంత్రిని డైరెక్టర్లంతా కలువగా ఐక్యంగా ఉండాలని ఆయన సూచించారు. జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేష్, డైరెక్టర్లు ఉన్నారు.

### వీడ్కోలు వేడుకలు

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు చదువుకొని భవిష్యత్తులో రాణించాలని ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, సుధాకర్ సూచించారు. డైరెక్టర్లు కదార్ల హరిప్రసాద్, జానకిరాం తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకోవాలి

దస్తురాబాద్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు సాగాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో అదనపు తరగతుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంతకు ముందు రూ.88లక్షలతో చేపట్టే అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు.తహసీల్దార్ కార్యాలయంలో 68 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేశ్, సతీశ్‌రెడ్డి తదితరలు ఉన్నారు.

కడెం: మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో బుధవారం పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరై పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదం అందించి సన్మానించారు. ఇందులో చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

- ఖానాపూర్‌లో ఏడాది ఉత్కంఠకు తెర



మున్సిపల్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పక్కన చైర్మన్, వైస్ చైర్మన్

ఖానాపూర్: ఏడాది కిందట ప్రారంభమైన అవిశ్వాస ప్రక్రియ బుధవారం చివరి దశకు చేరుకొని నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది. ఇప్పటికే చైర్మన్, వైస్ చైర్మన్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన 9మంది కౌన్సిలర్లు గద్దెదించారు. తాజాగా బుధవారం నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ సభ్యులు అనుకున్నట్లుగానే జరిగింది. నాలుగేళ్లుగా బీఆర్ఎస్ అధీనంలో ఉన్న చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కాంగ్రెస్ ఖాతాలోకి చేరాయి. జెడ్పీ సీఈవో, ప్రిసైడింగ్ అధికారి గోవింద్ ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోసం నిర్వహించిన సమావేశానికి ఉదయం 11 గంటలకే కౌన్సిలర్లు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరయ్యారు. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులకు ఒక్కో నామినేషన్ మాత్రమే రావడంతో ఏకగ్రీవమైందని ప్రిసైడింగ్ అధికారి తెలిపారు. చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికకు ఏడుగురు సభ్యుల మద్దతు మాత్రమే కావాల్సి ఉన్నప్పటికీ తొమ్మిది మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యేతో కలిపి 10 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. దీంతో చైర్మన్‌గా చిన్నం సత్యం, వైస్‌చైర్మన్‌గా కావలి సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు.

**మార్నింగ్‌వాక్‌తో ప్రజల్లోకి..**

తాను ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలోనే ఉండి మార్నింగ్‌వాక్ ద్వారా ప్రజల వద్ద వారికి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక అనంతరం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అందరి సహకారంతో ఖానాపూర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు జన్నారపు విజయలక్ష్మి, నాయిని స్రవంతి, పరిమి లత, ఆఫ్రీనా బేగం, కిషోర్‌నాయక్, తొంటి శ్రీనివాస్, ఫౌజియాబేగం తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను చూసే పార్టీలో చేరుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్‌తోపాటు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పరిమి సురేశ్, కౌన్సిలర్లు జన్నారపు విజయలక్ష్మిశంకర్, పరిమి లత, తొంటి శ్రీనివాస్, కాంగ్రెస్ గూటికి చేరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నిమ్మల రమేశ్, అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, గంగనర్సయ్య, జహీర్ అహ్మద్, గోవింద్, జహీర్ తదితరులు ఉన్నారు.

### 'అనర్హులుగా ప్రకటించాలి'

ఖానాపూర్: ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో పార్టీ విప్ ధిక్కరించి ఇతర పార్టీకి మద్దతు తెలిపిన బీఆర్ఎస్ కౌన్సిలర్లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాజగంగన్న బుధవారం నిర్మల్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌కు వినతిపత్రం అందజేశారు. వారిపై వెంటనే విచారణ చేసి అనర్హులుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ప్రదీప్, శ్రావణ్, రాకేశ్, సాబీర్ తదితరులు ఉన్నారు.

# సోన్ వైస్ ఎంపీపీగా నాగయ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న వైస్ ఎంపీపీ నాగయ్య

సోన్: మండల వైస్ ఎంపీపీగా అంకుల్ నాగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రిసైడింగ్ అధికారి నర్సింహారెడ్డి అన్నారు. ఇటీవల మండల వైస్‌ఎంపీపీ కొత్తగొల్ల నరేశ్ మరణించడంతో ఖాళీ అయిన పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం సోన్ ఎంపీడీవో కార్యాలయంలో వైస్‌ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించారు. ఎంపీడీవో సురేశ్, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నర్సింహారెడ్డి ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడుగురు ఎంపీటీసీలకు గాను ఐదుగురు ఎన్నికలో పాల్గొన్నారని పేర్కొన్నారు. న్యూవెల్మల్ బొప్పారం ఎంపీటీసీ అంకుల్ నాగయ్యను కూచన్‌పెల్లి ఎంపీటీసీ మెట్టు రాజేశ్వర్ బలపర్చగా పాక్‌పట్ల ఎంపీటీసీ మార మల్కవ్వ మద్దతు పలుకడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో ఎస్సై సంతోషం రవీందర్, దాసరి లింగవ్వ ఎంపీఓ ఖలీల్ హైమద్, బీజేపీ నాయకులు హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, జక్క రాజేశ్వర్, గంగారెడ్డి, శ్రీనివాస్, ఫక్రుద్దీన్, మక్కన్న తదితరులున్నారు.

# సారంగపూర్‌లో వీగిన అవిశ్వాసం

- పంతం నెగ్గించుకున్న బీఆర్ఎస్
- అవిశ్వాసంలో ఖంగుతిన్న బీజేపీ
- కాంగ్రెస్‌లోకి నూతన ఎంపీపీ?



బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతున్నట్లు చేతులు ఎత్తిన ఎంపీటీసీలు

నిర్మల్: సారంగాపూర్ మండల రాజకీయాలు రసవత్తరంగా మారాయి. అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్ పంతం నెగ్గించుకుంది. ఎంపీపీ సవితాబాయిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక మండల సమావేశంలో బీజేపీ ఎంపీటీసీలు కొందరు బీఆర్ఎస్‌కు మద్దతిచ్చారు. దీంతో బీఆర్ఎస్ ఎంపీటీసీ ఆడె సవితాబాయి మళ్లీ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఈ పరిణామాలతో బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఖంగుతిన్నారు. ఎంపీపీ పదవి తమకే వస్తుందని సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్న బీజేపీ నేతలు అయోమయంలో పడ్డారు.

**నాటకీయ పరిణామాలు..**

చించోలి(బి) గ్రామానికి చెందిన వెంకటరమణారెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపీటీసీగా గెలుపొందారు. అలాగే వీంద్రనగర్ నుంచి ఆడె సవి తా బాయి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించగా.. హనుమాన్‌తండా నుంచి రాథోడ్ రాజు సైతం ఎంపీటీసీగా గెలపొందారు. వీరిలో చించోలి(బి) ఎంపీటీసీ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరగా, రాథోడ్ రాజు బీజేపీలో చేరారు. మొత్తం 13 ఎంపీటీసీలు ఉండగా.. వంజర్ ఎంపీటీసీ ఎగ్గం సరితతోపాటు ఆడె సవితాబాయి ఎంపీపీ పదవిపై ఆశలు పెంచుకున్నారు. ఇద్దరూ తమ మద్దతుదారులతో క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. అవిశ్వాస సమయంలో బీజేపీకి తొమ్మిది మంది మద్దతు తెలుపుతూ క్యాంపునకు వెళ్లారు.. మిగిలిన నలుగురు బీఆర్ఎస్ వైపు ఉన్నారు. ఎంపీపీ ఎన్నిక సమయంలో బీజేపీ మద్దతుదారుల్లో కేవలం ఆరుగురు మాత్రమే బీజేపీకి మద్దతిచ్చారు. మిగిలిన వారు బీఆర్ఎస్ అభ్యర్థి వైపు మొగ్గు చూపడంతో ఆడె సవితాబాయి ఎంపీపీగా ఎన్నికయ్యారు. అయితే నూతనంగా ఎన్నికైన ఎంపీపీ సవితాబాయి, కోర్టు నుంచి స్టే తెచ్చుకుని మండల ఉపాధ్యక్ష పదవిలో కొనసాగుతున్న పతాని రాధ కాంగ్రెస్ పార్టీలో చేరుతునట్లు సమాచారం. కాగా.. ఎన్నికల అధికారి, మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావులపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీగా ఎన్నికైన సవితాబాయికి బీఆర్ఎస్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### వైద్యసేవల్ని వినియోగించుకోవాలి

నర్సాపూర్(జి): ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో గర్భిణులకు సాధారణ కాన్పులు, శస్త్ర చికిత్సలు చేస్తున్నామని తెలిపారు. అపెండెక్స్, కణుతులు, హైడ్రోసిల్, ట్యూబెక్టమీ వంటి ఆపరేషన్లకు దూర ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. ప్రభుత్వం ఇటీవల కొత్తగా 14 మంది స్టాఫ్ నర్సులను నియమించినందున సిబ్బంది కొరత కొంత తీరిందని అన్నారు. డాక్టర్లు సాయికృష్ణ, అంజుమ్, అశ్వీర్ రెడ్డి, హెడ్ నర్సులు లలిత, శోభ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముధోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899